ఉచిత మెగా కంటి వైద్య శిబిరం

విశాలాంధ్ర - బుచ్చయ్యపేట: మండలంలో మేజర్ పంచాయతీ వడ్డాదిలో జిల్లా అంధత్వ నివారణ సంస్థ అనకాపల్లి వారి సౌజన్యంతో వడ్డాది గ్రామంలో మంగళవారం కో ఆపరేటివ్ సొసైటీ వారి ఆధ్వర్యంలో కంటి వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో 120 మంది కంటి రోగులకు పరీక్షలు చేయగా 48 మందిని కంటి ఆపరేషన్‌కు ఎంపిక చేసి శంకర్ ఫౌండేషన్ కంటి ఆసుపత్రికి తరలించారు. స్పెషలిస్టులు (ప్రముఖ డాక్టర్లు)చే ఆసుపత్రిలో చికిత్స చేయుటకు రిఫర్ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో అనకాపల్లి జిల్లా టీడీపీ అధ్యక్షులు బత్తుల తాతయ్య బాబు, శాంతి, శంకర్ ఫౌండేషన్ డాక్టర్ గీతాంజలి, ఆప్తలమిక్ ఆఫీసర్ హరి చందన, శంకర్ ఫౌండేషన్ క్యాంపు మేనేజర్ అరుణ్ కుమార్, నర్సింగ్ స్టాఫ్ సంధ్య, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

సంక్షేమ హాస్టళ్లలో సమస్యలు పరిష్కరించాలి

ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో కలెక్టరేట్ వద్ద నిరసన

విశాలాంధ్ర బ్యూరో - అనకాపల్లి: రాష్ట్రవ్యాప్తంగా సంక్షేమ హాస్టల్లో సమస్యలు పరిష్కరించాలని ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా జిల్లా కలెక్టర్ కార్యాలయాలు వద్ద నిరసన కార్యక్రమంలో భాగంగా మంగళవారం కలెక్టర్ కార్యాల వద్ద నిరసన తెలిపి డీఆర్‌ఓ శ్రీనివాస్‌కి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి జి.ఫణీంద్ర కుమార్ మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ఎస్సీ, ఎస్టీ, బీసీ సంక్షేమ వసతి గృహాల్లో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో గత కొన్ని రోజుల నుంచి సంక్షేమ హాస్టళ్లలో సర్వే నిర్వహించామన్నారు. అనకాపల్లి జిల్లాలో ఎస్సీ, ఎస్టీ, బీసీ సంక్షేమ హాస్టల్లో సర్వే ద్వారా విద్యార్థులు చాలా దయనీయ పరిస్థితుల్లో ఉంటున్నారనేది మాకు అర్థమైందని అన్నారు. ముఖ్యంగా కొన్ని వసతి గృహాల భవనాలు శిథిలావస్థకు చేరి పెచ్చులు ఊడిపోతూ వర్షానికి కారిపోతూ ఉండడంవల్ల విద్యార్థులు ప్రాణాలను అరచేతిలో పెట్టుకొని సంక్షేమ వసతి గృహాల్లో ఉంటున్నారన్నారు. ఇటువంటి పరిస్థితుల్లో ఉన్న సంక్షేమ వసతి గృహాలను తక్షణమే పునర్ నిర్మించాలని, అద్దె భవనంలో ఉన్న వసతిగృహాలు విద్యార్థులకు సరిపడా మరుగుదొడ్లు, గదులు లేక తీవ్ర ఇబ్బందికి గురవుతున్నారని, కాబట్టి తక్షణమే అద్దె భవనంలో ఉన్న వాటికి సొంత భవనాలు నిర్మించి శిథిలావస్థలో ఉన్న భవనాలను పున: నిర్మించాలని డిమాండ్ చేశారు. గిరిజన వసతి గృహాలలో వర్కర్స్‌ని శాంక్షన్ పోస్టుల ద్వారా భర్తీ చెయ్యకపోవడం వల్ల విద్యార్థుల మెస్ ఛార్జెస్ నుంచి వర్కర్స్‌కి జీతాలు ఇవ్వడం జరుగుతుందన్నారు. దీనివల్ల విద్యార్థులకు సరైన భోజనం అందట్లేదని, పెరుగుతున్న ధరలకు అనుగుణంగా మెస్ చార్జీలు, కాస్మోటిక్ చార్జీలు పెంచాలని డిమాండ్ చేశారు. భవిష్యత్తులో పెద్ద ఎత్తున ఉద్యమానికి శ్రీకారం చుడతామని హెచ్చరించారు. ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు బి.బాబ్జి మాట్లాడుతూ గత ఆరు నెలల నుంచి పెండింగ్లో ఉన్న మెస్ బిల్లులు, కాస్మోటిక్ చార్జీలు విడుదల చేయాలని, అనకాపల్లి జిల్లా కేంద్రంగా ఎస్సీ, ఎస్టీ, బీసీ మహిళ వసతి గృహాలను ఏర్పాటు చేయాలని, పెరుగుతున్న ధరలకు అనుగుణంగా మెస్ చార్జీలు పెంచాలని, సంక్షేమ వసతి గృహాల మెయింటెనెన్స్‌కు నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా నాయకులు జగదీష్, సింహాద్రి, సతీష్, రంజిత, రాజేశ్వరి వివిధ ప్రాంతాల నుంచి విద్యార్థులు పాల్గొన్నారు.

కేరళ వయనాడ్ వరద బాధితులకు
సీపీఐ విరాళాల సేకరణ

విశాలాంధ్ర - నర్సీపట్నం: కేరళలోని వయనాడ్ వరద బాధితులకు ప్రతి ఒక్కరు అండగా నిలవాల్సిన అవసరం ఎంతైనా ఉందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు గుజ్జుల ఈశ్వరరావు అన్నారు. మంగళవారం కృష్ణ ప్యాలెస్ నర్సీపట్నంలో జరిగిన సర్వసభ్య సమావేశం ముగింపు అనంతరం విరాళాలను సేకరించే కార్యక్రమం చేపట్టారు. నర్సీపట్నంలో జిల్లా పలు ప్రాంతాల నుంచి వచ్చిన నాయకులు, కార్యకర్తలు తమకు తోచిన సాయం సీపీఐ నాయకులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేరళలో వయనాడు ప్రాంతంలో వరద విపత్తు ఏర్పడ డంతో వేలాదిమంది మృత్యువాత పడ్డారన్నారు. వరదల కారణంగా ఎన్నో కుటుంబాలు రోడ్డున పడ్డాయన్నారు. వారందరికీ వివరాలను సేకరించి పంపిస్తామన్నారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి బాలేపల్లి వెంకటరమణ, రాజన దొరబాబు, మాకిరెడ్డి రామునాయుడు, గురుబాబు తదితరులు పాల్గొన్నారు.

తల్లిపాలే బిడ్డకు అమృతం

విశాలాంధ్ర - బుచ్చయ్యపేట: బిడ్డకు తల్లిపాలు అమృతంతో సమానమని వైద్యాధికారి మౌనిక అన్నారు. మండలంలోని వడ్డాది గ్రామంలో తల్లిపాలు వారోత్సవాల సందర్భంగా ర్యాలీ చేసి ప్రజలకు అవగాహన కల్పించారు. స్థానిక పీహెచ్‌సీలో పోషకాహారం ప్రదర్శన ఏర్పాటు చేసి తల్లిపాలు గొప్పతనాన్ని తల్లులకు వివరించారు. బిడ్డకు తల్లిపాలు ఇవ్వడం ద్వారా బిడ్డ తల్లి ఆరోగ్యంగా ఉంటారన్నారు. వడ్డాది సెక్టర్ పరిధిలో అంగన్వాడి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

గొలుగొండ: గొలుగొండ మండలం పాత కృష్ణదేవి పేట గ్రామంలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో తల్లిపాల వారోత్సవాలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఎంవీకే సత్య శ్రీ మాట్లాడుతూ తల్లిపాలు పిల్లలకు చాలా ఆరోగ్యకరమని, తల్లిపాలు ఇవ్వడం వలన పిల్లలు ఆరోగ్యవంతంగా పెరుగుతారని అన్నారు. వ్యాధి నిరోధక శక్తి

పెరుగుతుందని, తల్లిపాలు పిల్లలకు ఎంతో శ్రేయస్కరమన్నారు. ఈ కార్యక్రమంలో పీవీ రాఘవ, సత్యవతి, పంచాయతీ కార్యదర్శి కిరణ్మయి, ఎంఎల్ఎచ్ పి.అనూష, ఏఎన్ఎం లక్ష్మి, మహిళా పోలీస్ మాధవి నీలిమ, అంగన్వాడీ టీచర్లు అచ్చియమ్మ, పుల్రె సత్యవతి, ఎం.వరలక్ష్మి, కే.దుర్గ తదితరులు పాల్గొన్నారు.

పేకాట శిబిరంపై పోలీసులు దాడి

విశాలాంధ్ర - పాయకరావుపేట: మండలంలోని నామవరం గ్రామంలో పేకాడుతున్న వారిపై సీఐ అప్పలరాజు ఆధ్వర్యంలో పోలీసు సిబ్బంది దాడి చేసి రూ.38,200 నగదు స్వాధీనం చేసుకొని, 11 మందిపై కేసు నమోదు చేశారు.

పాఠశాలను అభివృద్ధి చేసేవారిని ఎన్నుకోవాలి

విశాలాంధ్ర - నక్కపల్లి: పాయకరావుపేట నియోజకవర్గాన్ని అభివృద్ధి చేయడమే హోం మంత్రి వంగలపూడి అనిత లక్ష్యమని నక్కపల్లి మండల టీడీపీ అధ్యక్షుడు కొప్పిశెట్టి వెంకటేష్ అన్నారు. ఈ మేరకు హోం మంత్రి అనిత ఆదేశాలతో మంగళవారం గొడిచర్ల హైస్కూల్ పరిధిలో ఉన్న గ్రామాల టీడీపీ నాయకులతో నక్కపల్లి మండల టిడిపి అధ్యక్షుడు కొప్పిశెట్టి వెంకటేష్ సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా కొప్పిశెట్టి వెంకటేష్ మాట్లాడుతూ త్వరలో జరగబోయే విద్యా కమిటీ ఎన్నికలలో పాఠశాల అభివృద్ధికి పాటుపడే చైర్మన్ విద్యా కమిటీ సభ్యులని ఎన్నుకోవాలని కూటమి నాయకులకి సూచించారు. ఈ కార్యక్రమంలో క్లస్టర్ ఇన్‌చార్జి వైభోయిన రమణ, నానేపల్లి రాఘవ, దార్ల నాగరాజు, దార్ల కృష్ణ, మారిశెట్టి నానాజీ, పక్కుర్తి నాగు, పక్కుర్తి రాజు, కరణం సూరిబాబు, గండేడి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగుల సమస్యలపై స్పీకర్ అయ్యన్నకి వినతి

విశాలాంధ్ర - నర్సీపట్నం: డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ గురుకులం పాఠశాల అవుట్ సోర్సింగ్ ఉద్యోగస్తుల సమస్యలపై ఏపీ సభాపతి చింతకాయల అయ్యన్నపాత్రుడుకి మంగళవారం స్పీకర్ క్యాంప్ ఆఫీసులో వినతి పత్రం అందజేశారు. రాష్ట్రవ్యాప్తంగా సాంఘిక సంక్షేమ, బీసీ, ట్రైబల్ వెల్ఫేర్ హాస్టల్స్, గర్ల్స్ హాస్టల్లో పనిచేస్తున్న పురుష అవుట్సోర్సింగ్ సిబ్బందిని తొలగించి అక్కడ మహిళా సిబ్బందిని నియమించాలని, అదేవిధంగా బాయ్స్ హాస్టల్లో పనిచేస్తున్న మహిళా సిబ్బందిని తొలగించి అక్కడ పురుషులను నియమించాలని ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో, ఎన్నో సంవత్సరాల నుండి పనిచేస్తున్న కొంతమంది కుటుంబాలు రోడ్డున పడనున్నాయని స్పీకర్ అయ్యన్నపాత్రుడు వద్ద వాపోయారు. తక్కువ వేతనాలతో పనిచేస్తున్న వారికి వారి స్వస్థలంలోనే దగ్గర్లో ఉన్న ప్రభుత్వ కార్యాలయాల్లో కాని సోషల్ వెల్ఫేర్ డిపార్ట్మెంట్‌లో కానీ సర్దుబాటు చేయాలని స్పీకర్ అయ్యన్నపాత్రుడును కోరారు.

అనకాపల్లిలో ఇసుక స్టాక్ పాయింట్‌ను ఏర్పాటు చేయాలి

ఎమ్మెల్యే కొణతాలకు ఏఐటీయూసీ వినతి

విశాలాంధ్ర బ్యూరో - అనకాపల్లి: అనకాపల్లిలో ఇసుక ర్యాంపు (స్టాక్ పాయింట్)ను తక్షణం ఏర్పాటు చేసి భవన నిర్మాణ కార్మిక రంగాన్ని, కార్మికుల్ని ఆదుకోవాలని ఏఐటీయూసీ ఆధ్వర్యంలో శాసనసభ్యులు కొణతాల రామకృష్ణకు వినతిపత్రం అందజేశారు. కూటమి ప్రభుత్వం ఉచిత ఇసుక విధానాన్ని ప్రకటించడం అభినందనీయమే కానీ దానిని అమలు చేసే పద్ధతి లోప భూయిష్టంగా ఉందని ఏఐటీయూసీ అనకాపల్లి జిల్లా గౌరవా ధ్యక్షులు వై.ఎన్.భద్రం, భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా నాయకులు మొల్లేటి ఈశ్వరరావు, చిన్ని సత్తిబాబు, కే.రామారావు, కే.గణేష్, ఎం.నూకేష్, ఎస్.సత్తిబాబు అన్నారు. అనకాపల్లిలో ఇసుక స్టాక్ పాయింట్ లేక అగనంపూడిలో స్టాక్ పాయింట్ ఉన్నా అక్కడ విశాఖ జిల్లా వారికే ఇసుక అమ్ముతున్నారని ఇక గత్యంతరం లేక తప్పనిసరి పరిస్థితుల్లో నక్కపల్లి నుండి ఇసుక తెచ్చుకోవాల్సి వస్తుందని దీనివల్ల వినియోగదారుల పైన పెనుభారం పడుతుందని వారు రామకృష్ణకు వివరించారు. గత ప్రభుత్వ హయాంలో అన్ని ఖర్చులతో కలుపుకొని ట్రాక్టర్ ఇసుక 6000కు దొరకగా మీ ప్రభుత్వ హయాంలో అదే ట్రాక్టర్ ఇసుక 9000 చెల్లించవలసి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో అదే కాకుండా ఇనుము, సిమ్మెంటు, ఇటుక వంటి ఇతర వస్తువులు విపరీతంగా పెరగడంతో పేద ప్రజలు తమ ఇళ్ళను రిపేర్లు గాని నిర్మాణాలు గానీ చేపట్టలేకపోతున్నారని తెలిపారు. దీంతో భవన నిర్మాణ రంగ కార్మికులకు పనులు దొరక వారి కుటుంబాలు పస్తులతో గడపాల్సిన పరిస్థితి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. గత ప్రభుత్వం తీసుకువచ్చిన నూతన ఇసుక పాలసీ వల్ల తీవ్రంగా నష్టపోయిన భవన నిర్మాణ కార్మికులను మీ ప్రభుత్వమైనా ఆదుకుంటుందని ఆశించని కార్మికులకు నిరాశ ఎదురైందని తెలిపారు. వెంటనే ఎమ్మెల్యే కలుగజేసుకుని అనకాపల్లి సమీపంలో ఇసుక ర్యాంపు స్టాక్ పాయింట్‌ను ఏర్పాటు చేయించి నిర్మాణ రంగాన్ని, వేలాదిగా ఉన్న భవన నిర్మాణ రంగ కార్మికులను ఆదుకోవాలని వారు విజ్ఞప్తి చేశారు. శాసనసభ్యులు కొణతాల రామకృష్ణ స్పందిస్తూ వెంటనే అధికారులతో మాట్లాడి సమస్య పరిష్కరిస్తారని హామీ ఇచ్చారు.

బలం లేకున్నా కూటమి పోటీ

మాజీ మంత్రి బొత్స సత్యనారాయణ

విశాలాంధ్ర - యస్.రాయవరం: స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల్లో బలం లేకున్నా కూటమి పోటీ చేయడం కుట్ర రాజకీయాలకు నిదర్శనమని మాజీ మంత్రి, ఎమ్మెల్సీ అభ్యర్థి బొత్స సత్య నారాయణ అన్నారు. మంగళవారం సాయంత్రం మండలంలో అడ్డురోడ్డులో పాయకరావుపేట నియోజకవర్గంలో ఎంపీటీసీలు, ముఖ్య నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల జరిగిన ఎన్నికల్లో కూటమి పార్టీ తప్పుడు ప్రచారం హామీలను ఇచ్చి గెలవడం జరిగిందని అన్నారు. ఇచ్చిన హామీలను అమలు చేయకుండా ఆర్థిక పరిస్థితి బాగా లేదని ప్రచారం చేస్తున్నారని విమర్శించారు. గతంలో ఇదే ఎన్నికల్లో వైసీపీకి స్వల్ప తేడా ఉన్న జగన్మోహన్ రెడ్డి పోటీ పెట్టలేదని అయితే కూటమికి బలం లేకున్నా పోటీ చేయడం జరుగు తుందని తెలిపారు. ఎమ్మెల్సీ ఎన్నికల తనను గెలిపించాలని అభ్యర్థించారు.

అనంతరం నియోజకవర్గంలో యస్.రాయవరం, నక్కపల్లి, పాయకరావుపేట, కోటవురట్ల మండలాల్లో ఎంపీటీసీలతో విడివిడిగా సమావేశమయ్యారు. ఈ కార్యక్రమంలో మాజీ బూడి ముత్యాల నాయుడు, మాజీ ఎమ్మెల్యేలు కరణం ధర్మ శ్రీ, కంబాల జోగులు, మాజీ ఎమ్మెల్సీ డి.వి. సూర్యనారాయణరాజు, వైసీపీ జిల్లా అధ్యక్షుడు బోడ్డేడ ప్రసాద్, వైసీపీ నాయకులు వీసం రామకృష్ణ, చిక్కాల రామారావు, బొలిశెట్టి గోవిందరావు, దత్తుడుబాబు, కొణతాల శ్రీనివాసరావు, సీరం నరసింహమూర్తి, పైల రమేష్, ఎంపీపీ, జెడ్పీటీసీలు ఎంపీటీసీ సభ్యులు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

సుప్రీంకోర్టు తీర్పుపై కేజే.పురంలో సంబరాలు

విశాలాంధ్ర - వి.మాడుగుల: ఎస్సీల్లో ఉమ్మడి ఏబిసిడి వర్గీకరణ పోరాటంలో సుప్రీంకోర్టు తీర్పుపై మాడుగుల మండలం కేజే పురం గ్రామంలో గల బాబు జగజీవన్ రావ్ యువజన సేవా సంఘం ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. మాదిగ ఉద్యోగుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మోర్తా శ్రీనివాసరావు అధ్యక్షతన సమావేశం నిర్వహించడం జరిగింది. ముఖ్య అతిథిగా మాదిగ ఉద్యోగుల సంఘం అనకాపల్లి జిల్లా సీనియర్ నాయకులు కండెల్లి వెంకటరావు మాట్లాడుతూ ఎస్సీలు ఉమ్మడి ఏబిసిడి వర్గీకరణ పోరాటం కోసం మాన్యశ్రీ మందకృష్ణ మాదిగ ఆధ్వర్యంలో అనేక ఉద్యమాలు చేపట్టారన్నారు. 30 సంవత్సరాల ఉద్యమం ఫలితంగా ఆగస్టు ఒకటో తేదీన సుప్రీంకోర్టు తీర్పు మా అందరి జీవితాల్లో సంతోషాన్ని ఆనందాన్ని నింపిందన్నారు. ఎమ్మార్పీఎస్ ఉద్యమం కోసం మాన్యశ్రీ మందకృష్ణ మాదిగ ఆధ్వర్యంలో ఆయన అడుగుజాడల్లో ప్రతి యువకులు నడవాలని పిలుపునిచ్చారు. అనంతరం ఆయన చిత్రపటానికి పాలాభిషేకాన్ని నిర్వహించారు ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ చిన్నం దాలిబాబు, ఎమ్మార్పీఎస్ సీనియర్ కార్యకర్త బెన్నవోలు జగ్గ అప్పారావు, చిన్నం మాలి బాబు కొండారావు చిన్నం శంకర్, తాడి మాలి బాబు, చిన్నం నూకరాజు, రాము, ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షులు బెన్నవోలు పరదేశి నాయుడు, గ్రామ పెద్దలు సమక్షంలో కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు.

విద్యార్థులకు ఆటల పోటీలు

విశాలాంధ్ర - పాయకరావుపేట: మండలంలోని పెదరామభద్రపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో స్వాతంత్ర దినోత్సవ వేడుకలను పురస్కరించుకొని ప్రధానోపాధ్యాయులు కోడి శ్రీనివాసరావు, వ్యాయామ ఉపాధ్యాయులు షేక్ రహమాన్ ఆధ్వర్యంలో విద్యార్థులకు ఆటల పోటీలు నిర్వహించారు. విద్యార్థులు ఆనందోత్సవాల మధ్య అత్యంత ఉత్సాహంగా ఆటల పోటీల్లో పాల్గొన్నారు. ప్రారంభం రోజు బాలికల సీనియర్స్, బాలుర సీనియర్స్ కబడ్డీ పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా కోడి శ్రీనివాసరావు మాట్లాడుతూ చదువుతో పాటు మానసిక ఆరోగ్యానికి ఆటలు ముఖ్యమని, విద్యార్థులకు క్రీడా మైదానమే నిజమైన స్వర్గమని అన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు జి.భావన్నారాయణ, ఎస్.రవి కృష్ణ, ఐ.శివాజీరావు, ఆర్.దుర్గా భవాని, వై.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

కంపు కొడుతున్న కాలువలు

విశాలాంధ్ర - కే.కోటపాడు: మండల కేంద్రం కే.కోటపాడులో మురుగునీటి కాలువలు అపరిశుభ్రంగా తయారయ్యాయి. కాలువల్లో పూడిక తీయక నెలల తరబడి వదిలివేయడంతో వాటి నుండి వచ్చే దుర్గంధంతో పలువురు ఇబ్బందులు పడుతున్నారు. కంచర వీధిలో ఉన్న కాలువల ద్వారా మురుగునీరు పోయే

మార్గం లేక ఎక్కడకక్కడే నీరు నిల్వ ఉండటంతో దోమలు విజృంభిస్తున్నాయి. పారిశుద్ధ్య నిర్వహణపై పంచాయతీ సిబ్బంది ఏమాత్రం శ్రద్ధ వహించడం లేదు. నెలకు ఒక్కసారైనా కాలువలు శుభ్రపరిచే కార్యక్రమం నిర్వహించడం లేదని కంచరవీధికి చెందిన ముండూరు రాజు ఆరోపించారు. ఇంటి పన్నులు వసూలుపై ఉన్న శ్రద్ధ గ్రామ పరిశుభ్రతపై లేదని విమర్శించారు. అలాగే ప్రధాన వీధుల్లో ఉన్న కాలువలు రామకోవెల వద్ద ఉన్న అంగన్వాడీ భవనాల సమీపంలో ఉన్న కాలువల్లో నీరు ఎటు పోవాలో తెలియక అక్కడికక్కడే నిల్వ ఉండిపోతుంది. తక్షణమే పారిశుద్ధ్య సిబ్బంది కాలువల్లో పూడిక తొలగించి దోమలబారి నుండి రక్షించాలని పలువురు కోరుతున్నారు.

ఎన్‌డీఏ కూటమి 5 మెన్ కమిటీ ఎన్నిక

విశాలాంధ్ర - యలమంచిలి/రాంబిల్లి: రాంబిల్లి జనసేన పార్టీ కార్యాలయంలో మంగళవారం ఎన్‌డీఏ కూటమి సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఎన్‌డీఏ కూటమి తరుపున 5 మెన్ కమిటీ సభ్యులను ఎన్నుకొన్నారు. యలమంచిలి కూటమి 5 మెన్ కమిటీ సభ్యులుగా బొద్దపు శ్రీనివాసరావు, గొర్లె శివ నారాయణమూర్తి (నానాజీ), నక్కా శివ శంకర్, కొఠారు సాంబశివరావు, కర్రి ఝాన్సీలను ఎన్నుకొన్నారు. వీరికి కూటమి నాయకులు అభినందనలు తెలిపారు.

గుంతలను పూడ్చిన యువకులు

విశాలాంధ్ర - పరవాడ: గాజువాక-యలమంచిలి ప్రధాన మార్గంలో రావాడ పంచాయతీ పరిధి ధర్మరాయుడుపేట జంక్షన్ వద్ద రోడ్డుపై గల పెద్ద పెద్ద గుంతలను స్థానిక యువకులు పూడ్చారు. ఈ జంక్షన్‌లో పెద్ద పెద్ద గుంతలు ఏర్పడి ప్రమాదాలు జరుగుతున్నా ప్రజాప్రతినిధులు, అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఈ తరుణంలో ముందుకొచ్చి స్థానికుల సాయంతో పెద్ద పెద్ద గుంతలను పూడ్చిన యువకులను పలువురు అభినందించారు. నెల రోజుల క్రితం ఇదే జంక్షన్ వద్ద బైక్‌పై వస్తూ ఓ యువకుడు గుంతను గమనించక పోవడంతో ప్రమాదానికి గురై ప్రాణాలు కోల్పోయాడని, పలువురు ప్రమాదానికి గురవుతున్నారని స్థానికులు చెబుతున్నారు. రోజు రోజుకీ ఈ జంక్షన్ ప్రమాదకరంగా మారుతోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి పాడైన రోడ్లను బాగుచేయాలని వాహనదారులు, ప్రయాణికులు, ప్రజలు కోరుతున్నారు.

టేకు ప్లాంటేషన్ సందర్శన

విశాలాంధ్ర - గొలుగొండ: మండలంలో అచ్చయ్యపేట వద్ద నూతనంగా ప్లాంటేషన్ చేసిన టేకు తోటలను విశాఖపట్నం ఏసీపీ ఎఫ్.శ్రీకాంత్ రెడ్డి మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా నూతన ప్లాంటేషన్‌పై సిబ్బందికి తగు సూచనలు సలహాలు అందించారు. ముఖ్యంగా సిబ్బంది విధి నిర్వహణ పట్ల నిర్లక్ష్యం వహించకుండా శ్రద్ధ వహించాలని బాధ్యతాయుతంగా పని చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎలమంచిలి సబ్ డీఎఫ్‌ఓ సునీల్ కుమార్, కృష్ణదేవి పేట రేంజ్ ట్రైనింగ్ ఐఎఫ్ఎస్ అధికారి అబ్దుల్ రవూఫ్, కృష్ణదేవి పేట రేంజ్ అధికారి వెంకట్రావు, గొలుగొండ సెక్షన్ ఆఫీసర్ లక్ష్మణరావు, ఆఫీసర్ టి.గౌరీ, గొలుగొండ బీట్ అధికారి నాగేశ్వరరావు పాల్గొన్నారు.

స్థాపితం:1952

విశాలాంధ్ర

తెలుగు జాతీయ దినపత్రిక

విలేకరులు కావలెను

అనకాపల్లి జిల్లాలో ఈ కింది కేంద్రాల్లో పని చేయుటకు కనీస విద్యార్హత ఇంటర్, ఆపైన చదివి జర్నలిజం పట్ల ఆసక్తి కలిగి తెలుగు భాషలో స్పష్టంగా రాయడం, చదవడం వచ్చి ఉండాలి.

తేది: 18-8-2024వ తేదీన ఉదయం 10 నుంచి 11 గంటల వరకు అనకాపల్లి విశాలాంధ్ర కార్యాలయంలో అర్హత రాత పరీక్ష నిర్వహించబడును. ఆసక్తి ఉన్న వారు 18వ తేదీ ఉదయం 9.30 గంటల్లోగా వాట్సాప్‌లో గాని నేరుగా గాని తమ పేర్లు నమోదు చేసుకోగలరు. అదేరోజు మధ్యాహ్నం 2 గం.ల నుంచి ఇంటర్వ్యూలు నిర్వహించబడును.

ఖాళీలు: అనకాపల్లి టౌన్, అనకాపల్లి కలెక్టరేట్, చోడవరం రూరల్, రోలుగుంట, బుచ్చయ్యపేట, నర్సీపట్నం రూరల్, నాతవరం, సబ్బవరం కేంద్రాల్లో పని చేయాలి.

సంప్రదించాల్సిన చిరునామా:
కొండలరావు, విశాలాంధ్ర బ్యూరో చీఫ్
విశాలాంధ్ర కార్యాలయం, దుర్గా లాడ్జి వీధి, నర్సింగరావుపేట,
రామచంద్ర థియేటర్ వెనుక, అనకాపల్లి.
సెల్: 9291900805, 9573385159.

విశాలాంధ్ర
అనకాపల్లి
పేజీ : 2
బుధవారం 07, ఆగస్టు 2024

యోగా వల్ల ఎన్నో ప్రయోజనాలు

ఉపమాక దేవస్థానం మాజీ చైర్మన్ బుజ్జి

విశాలాంధ్ర-నక్కపల్లి : యోగా వల్ల ఎన్నో ప్రయోజనాలున్నాయని, మానసిక ప్రశాంతత, చక్కటి ఆరోగ్యం, దీర్ఘ కాలలిక వ్యాధుల నివారణకు యోగాసనాలు ఎంతో ఉపయోగపడతాయని ఉపమాక దేవస్థానం మాజీ చైర్మన్ కొప్పిశెట్టి బుజ్జి అన్నారు. మంగళవారం ఉపమాకలో ఉచిత యోగా శిక్షణా తరగతులను ప్రారంభించారు. ఈ సందర్భంగా బుజ్జి మాట్లాడారు. అనేక వ్యాధులు దరిచేరకుండా యోగా ఒక దివ్య ఔషధంగా పనిచేస్తుందని చెప్పారు. వేంపాడు ఆయుర్వేద ఆస్పత్రి యోగా టీచర్ డి.రాంబాబు పలు ఆసనాలు. ప్రాణాయామం, ధ్యానం వంటి వాటిపై శిక్షణ ఇస్తున్నారు. కార్యక్రమంలోఉపమాక సర్పంచ్ ప్రగడ వీరబాబు, కొప్పిశెట్టి హరి, నరిశే దిలీప్, తదితరులు పాల్గొన్నారు.

తిమ్మాపురంలో పారిశుధ్య పనులు

విశాలాంధ్ర-యస్.రాయవరం : మండలంలో తిమ్మాపురం గ్రామం లోని పారిశుధ్య పనులు చేపట్టారు. ప్రత్యేక డ్రైవ్ లో భాగంగా చేస్తున్న ఈ పనులను సర్పంచ్ కర్రీ సత్యనారాయణ, పంచాయతీ కార్యదర్శి రామిరెడ్డి పరిశీ లించారు. గ్రామంలో పరిశుభ్రత పాటించాలని తమ పంచాయతీ ముఖ్య లక్ష్యం అని సర్పంచ్ తెలిపారు.

చుండూరు హంతకులను శిక్షించాలి

33 ఏళ్ళైనా చుండూరు దళితులపై హత్యాకాండ కేసులో దక్కని న్యాయం

విశాలాంధ్ర -చోడవరం: చుండూరు దళితులపై ఆధి పత్య కులాల హత్యా కాండ జరిగి 33 ఏళ్ళ యినా ఇంతవరకు న్యాయం జరగలేదని దళిత సంఘాల నేతలు ధ్వజమెత్తారు. ఘటనరోజైన ఆగస్టు 6 సందర్భంగా దళితవిముక్తి ఆధ్వర్యంలో చోడవరం లోని సభ కార్యక్రమాన్ని చేపట్టారు. చుండూరు హంతకులు ఎక్కడంటూ నిరసించారు. దళిత విముక్తి రాష్ట్ర కన్వీనర్ సుర్ల వెంకటరమణ నేతృత్వంలో జరిగిన కార్యక్ర మంలో పలు దళిత నేతల పాల్గొని ప్రభుత్వాల తీరును దుయ్యబట్టారు. 1991 ఆగస్టు 6న చుండూరులో దళితులపై మారణకండకు పాల్పడి 8 మంది దళితులను హతమార్చారని గుర్తు చేశారు. ఈ కేసులో సాక్షాధారాలు ఉన్నప్పటికీ 13 ఏళ్ల తర్వాత కొంత పాక్షిక న్యాయం జరిగిందని చెప్పారు . ఈ కేసును తిరగతోడి విచారించిన హైకోర్టు ఈ కేసును కొట్టివేసి హంతకులను వదిలేసారన్నారు. అధికార ,ప్రతిపక్ష పార్టీలు కోర్టులో పోలీసులు హంతకులకు కొమ్ము కాయడం వల్లే అన్యాయం జరిగిందన్నారు. సుప్రీంకోర్టులో ఈ కేసును అప్పీ లు చేసినప్పటికీ త్వరితగతిన పరిష్కారం కావడానికి రాష్ట్ర ప్రభుత్వం నుండి చొరవ లేదన్నారు. దేశంలో అనేక కేసులను ఫాస్ట్ ట్రాక్ కోర్టు ద్వారా పరిష్కారం చేసినప్పటికీ దళితుల కేసుల విషయంలో మాత్రం తీవ్ర జాప్యం దేనికని ప్రశ్నించారు. దళితుల హత్యల పరంపర కొనసాగు తున్నప్పటికీ వాటిని అదుపు చేయడంలో ప్రభుత్వాలు విఫలం అవుతున్నాయని మండిపడ్డారు .దళి తులు పోరాడి సాధిం చుకున్న ఎస్సీ, ఎస్టీ అత్యాచార నిరోధక చట్టం ప్రభుత్వాల తీరువల్లే నిర్వీర్యం అవుతుందన్నారు. మోడీ నాయకత్వంలో దేశంలో మనువాద ప్రభుత్వం కొనసాగు తుందని అనేక రాష్ట్రాలలో దళితులు, ఆదివాసీలు, మైనారిటీలపై ప్రభుత్వ ప్రేరేపిత హత్యాకాండలు కొనసాగుతున్నాయన్నారు. దళిత, బహుజనులకు రక్షణ కల్పిస్తున్న రాజ్యాంగాన్ని మార్చివేసే కుట్ర కొనసాగు తుందన్నారు. కార్యక్రమంలో మనభూమి ఎడిటర్ పిసత్యనారాయణ, దళిత విముక్తి ప్రతినిధులు బి.అప్పారావు, బి.సన్యాసమ్మ,అనకాపల్లి దళిత నాయకులు నర్సయ్య, చోడవరం నాయకులు హుస్సేన్, బోడయ్య, ఈశ్వరి, ద్వారకనగర్ సంక్షేమ సంఘం నాయకులు గొల్లన్న, తారబి, పేరమ్మ, జ్యోతి, మొతి, మహేష్, అప్పయ్యమ్మ, శ్రీను, దావీద్,చిన్నారావు, భవాని తదితరులు పాల్గొన్నారు.

ప్రతీ ఇంటి నుండి చెత్త సేకరణ పక్కాగా జరగాలి

జీవీఎంసీ కమిషనర్ సంపత్ కుమార్

విశాలాంధ్ర-విశాఖపట్నం: ప్రతి ఇంటి నుండి చెత్త సేకరణ పక్కాగా జరగాలని జీవీఎంసీ కమిషనర్ పి.సంపత్ కుమార్ అధికారులను ఆదేశించారు. మంగళవారం ఆయన క్షేత్రస్థాయి పర్యటనలో భాగంగా 4వ జోన్ 28వ వార్డు పరిధిలోని రామనగర్, నెహ్రూ నగర్ తదితర ప్రాంతాలలో పర్యటించారు. ఈ సందర్భంగా జివిఎంసి కమిషనర్ మాట్లాడుతూ నివాసిత ప్రాంతాలలో ప్రతిరోజు క్లాప్ వాహనాల ద్వారా చెత్త సేకరణ జరపాలని, కాలువలలో వ్యర్ధాలు లేకుండా పారిశుధ్య కార్మికులచే నిత్యం వ్యర్ధాలను తొలగించి, మురుగునీరు సాఫీగా పోయే విధంగా చూడాలని జోనల్ కమీషనర్ ప్రసాద్ రావు ను ఆదేశించారు. వాణిజ్య సముదాయములు, దుకాణదారులు, కాలువల లో చెత్త వేయకుండా డస్ట్ బిన్లు ఏర్పాటు చేసుకొని జీవీఎంసీ చెత్త తరలించే వాహనానికి నేరుగా అందించే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. రోడ్లు, కాలువలలో, బహిరంగ ప్రదేశాలలో నివాసితులు వ్యర్ధాలు వేయకుండా వారంలో ఒక్కసారి ప్రత్యేకంగా అవగాహన కార్యక్రమం నిర్వహించాలని, కాలువలలో వ్యర్ధాలు పెరిగిపోయినందున దోమలు వృద్ధి చెంది సీజనల్ వ్యాధులైన మలేరియా, డెంగ్యూ వ్యాధులు వ్యాప్తి చెందుతాయని, అందుకు కాలువలలో పూడికలతో పాటు ఫాగింగ్, స్ప్రేయింగ్ చేయించాలని, నెహ్రూ నగర్ ధోబి ఖానాను ఆనుకున్న ప్రధాన కాలువలలో వ్యర్ధాలు అధికంగా ఉన్నాయని వారంలో ఒకరోజు కాలువలో పూడికలు తొలగించాలని ఏ.ఎమ్.ఓ.హెచ్ డాక్టర్ రాజేష్ ను కమీషనరు ఆదేశించారు. నెహ్రు నగర్ ప్రధాన కాలువను ఆనుకోని వున్న ఫుట్ ఓవర్ బ్రిడ్జ్ యొక్క పిల్లర్లకు మరమ్మతులు చేపట్టాలని, కాలువలపై ఉన్న పలకలను పూర్తిగా మూసివేయకుండా చెత్త తీసేందుకు వీలుగా పలకలను అమర్చాలని కార్యనిర్వాహక ఇంజినీరు సంతోషిని ఆదేశించారు. పలుచోట్ల కాలువ గుండా తాగునీరు పైపులను గమనించి మంచినీరు పైపులు లోని నీరు కలుషితం కాకుండా నీటి పైపులు క్రమ పద్ధతిలో మార్పు చేయాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. ఈ పర్యటనలో అసిస్టెంట్ సిటీ ప్లానర్ ఝాన్సీ, టిపిఓ వినయ్ ప్రసాద్, సహాయక ఇంజనీర్ జాన్సన్, సచివాలయం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

400 ఓట్లు తేడా ఉంటే కూటమి పోటీ చేయడం ధర్మమా?

వైసీపీ విశాఖ ఎమ్మెల్సీ అభ్యర్థి బొత్స సత్యనారాయణ

విశాలాంధ్ర-నర్సీపట్నం: ఎమ్మెల్సీ ఎన్నికల్లో కూటమి పార్టీ పోటీ చేయాలనుకోవడం ప్రజాస్వామ్య విలువలకు పాతర వేసినట్టేనని వైసీపీ ఎమ్మెల్సీ అభ్యర్థి బొత్స సత్యనారాయణ అన్నారు. మంగళవారం నర్సీపట్నం మాజీ ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ క్యాంపు కార్యాలయానికి వచ్చారు. నర్సీపట్నం అసెంబ్లీ నియోజకవర్గంలోని ఎంపీటీసీలు, జెడ్పీటీసీలు, ఎంపీపీ, మున్సిపల్ కౌన్సిలర్లతో సమావేశమై మాట్లాడారు. 400 ఓట్లు మెజార్టీ స్పష్టంగా కనిపిస్తుంటే కూటమి ఎమ్మెల్సీ ఎన్నికల్లో అభ్యర్థిని పెట్టాలనుకోవడం ధర్మమా అని ప్రశ్నించారు. గడిచిన ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైసీపీ కన్నా కేవలం 50 ఓట్లు అధికంగా ఉన్నాయనే కారణంతో అప్పట్లో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్నప్పటికీ పోటీ చేయలేదనే విషయాన్ని గుర్తు చేశారు. ప్రస్తుతం ఎమ్మెల్సీ ఎన్నికల్లో టీడీపీ, జనసేన, బిజేపి కూటమి అభ్యర్థిని పెడితే ప్రలోభాలతో ఎలాగైనా గెలవాలని పోటీకి దిగుతున్నట్టేనని భావించాల్సి ఉందన్నారు. ఆరు నెలల పాటు ఏమీ మాట్లాడకుండా ఉండాలని మొదట్లో అనుకున్నామని, కూటమి పాలన తీరు గమనించిన తర్వాత ప్రశ్నించాల్సి వస్తుందని వ్యాఖ్యానించారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో గెలవడానికి ప్రలోభాలకు తెరతీసే అవకాశం ఉందని, వైసీపీ స్థానిక సంస్థల అభ్యర్థులు పార్టీ అభ్యర్థి గెలుపు తమకు గౌరవంగా తీసుకోవాలని కోరారు. ఈ ఎన్నికల్లో వైసీపీని గెలిపించడం ద్వారా మన గౌరవాన్ని మనం కాపాడుకున్నట్లు అవుతుందని చెప్పారు. కార్యకర్తలు, నాయకుల గౌరవాన్ని కాపాడే బాధ్యత నాయకులుగా తమపై ఉందన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు కూటమి నేతలు రాష్ట్రం అప్పులపై తప్పుడు ప్రచారం చేస్తున్నారని విమర్శించారు. ఏ రాష్ట్రమైనా పరిమితికి లోబడే అప్పులు చేయాల్సి ఉందని చెప్పారు. ఈ విషయం అప్పుడు ప్రచారం చేసే వారికి కూడా తెలుసని అన్నారు. కేంద్ర ప్రభుత్వ అనుమతితోనే రాష్ట్ర ప్రభుత్వాలు అప్పులు తీసుకుంటాయని చెప్పారు. స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులతో నేరుగా పార్టీ అధినేత మాజీ ముఖ్యమంత్రి వైయస్. జగన్మోహన్‌రెడ్డిని కలిసి మాట్లాడుతారని చెప్పారు. విజయవాడలో జగన్‌తో ముఖాముఖి సమావేశం ఉంటుందని వెల్లడించారు. సమావేశంలో పాల్గొన్న మాజీ ఉపముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు, మాజీ మంత్రి కారుమూరి నాగేశ్వరరావు, చోడవరం మాజీ ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ మాట్లాడుతూ ఎమ్మెల్సీ ఎన్నికల్లో బొత్స గెలుపుతో రాష్ట్ర స్థాయిలో పార్టీకి ఊపు తీసుకురావాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమానికి నర్సీపట్నం మాజీ ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ అధ్యక్షత వహించారు. మాజీ ఎమ్మెల్సీ డివి.సూర్యనారాయణరాజు, రుత్తల ఎర్రాపాత్రుడు (బాబులు), చింతకాయల సన్యాసిపాత్రుడు, బోళెం నర్సింహమూర్తి తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ డిగ్రీ, పీజీ కళాశాలలో అంతర్జాతీయ సెమినార్

విశాలాంధ్ర- యలమంచిలి : శ్రీ గురజాడ అప్పారావు ప్రభుత్వ డిగ్రీ పీజీ కళాశాల, యలమంచిలి జియో కేర్ ఫౌండేషన్ న్యూఢిల్లీ సహాయంతో నవంబరు 29, 30 తేదీలలో సైన్స్, సాహిత్యం ప్రభావం, ప్రేరణ అనే అంశంపై అంతర్జాతీయ సెమినార్ ను నిర్వహిస్తుందని కళాశాల ప్రిన్సిపాల్ డా. పి.చంద్రశేఖర్ అన్నారు. సాహిత్యంపై సైన్స్ ప్రభావం, సైన్స్ పై సాహిత్య ప్రభావం, సాహిత్యంలో శాస్త్రీయ ఆలోచనలు, వైజ్ఞానిక పరిశోధన ఆవిష్కరణలపై సాహిత్య ప్రభావం, పర్యావరణ సాహిత్యం అనే అంశాలపై చర్చలు జరుగుతాయని ప్రిన్సిపాల్ ప్రిన్సిపాల్ డా. పి. చంద్ర శేఖర్ తెలిపారు. ఆసక్తి కలిగినవారు కన్వీనర్ కర్రీ సుధను 8309739377, 9100443611 ను సంప్రదించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో నక్కపల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్. కే.శివయ్య, తెలుగు విభాగాధిపతి వి ఏ సత్యన్నారాయణ, ఇంగ్లీష్ విభాగాధిపతి కె. ప్రేమసాగర్ కార్యక్రమ, కో-కన్వీనర్ డాక్టర్. సుజాత, తెలుగు అధ్యాపక సిబ్బంది, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

మద్యం బాబులకు జరిమానా

విశాలాంధ్ర-అనందపురం: ఆనందపురం పోలీస్ స్టేషన్ పరిధిలో మద్యం సేవించి వాహనాలు నడుపుతూ పట్టుపడ్డ 8 మంది మందుబాబులకు భీమిలి 15వ అదనపు మెట్రోపాలిటన్ మెజిస్ట్రేట్ కోర్టు జడ్జ్ సౌజన్య మంగళవారం 8 మందికి ఒక్కొక్కరికి 10 వేలు చొప్పున 80,000 అపరాధ రుసుము విధించారని ఆనందపురం ట్రాఫిక్ ఎస్ఐ పాపారావు తెలిపారు.